## క్లుప్తంగా

### సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీపీ సత్తిబాబు



నారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్‌శాఖలో విశిష్ట సేవలకుగాను ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు సేవా, ఉత్తమ సేవా పతకాలు పొందారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్‌ను టీకే రాణాను ఆయన కార్యాలయంలో మోకా సత్తిబాబు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు.

### రేపు రైతుబజార్‌లో ఉచిత వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక రైతుబజార్‌లో ఈ నెల 8వ తేదీన ఎంజె నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు రైతు బజార్‌లోని అమ్మకందార్లు, కొనుగోలుదారులు, సిబ్బంది ప్రయోజనార్థం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై విశేష అనుభవంగల వైద్యులు ఎంజె నాయుడు, రవితేజ, వంశీకృష్ణలు తమ సాంకేతిక సహాయక బృందంతో కలిసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేస్తారన్నారు. బీపీ, షుగర్‌లతోపాటు కీలకమైన ఎముకల అరుగుదల పరీక్షలు చేస్తారని తెలిపారు. పక్షవాతానికి గురైన రోగులు త్వరగా కోలుకునేందుకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఎన్‌పురం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సిద్దెల నాగరాజు కార్పెంటర్‌గా పనిచేసుకుంటూ భార్య సిద్దెల భూలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలసి ముత్యాలంపాడు, టీచర్స్ కాలనీలో నివాసముంటున్నారు. భార్య భూలక్ష్మి అనారోగ్యంతో పాటు మానసిక పరిస్థితి సరిగా ఉండేది కాదు. దీంతో అప్పుడప్పుడు ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళిపోయి గుంటూరు జిల్లా, అచ్చంపేటలోని తన పుట్టింటికి వెళ్లేది. అక్కడి వారు విషయం తెలపడంతో భర్త వెళ్ళి ఇంటికి తీసుకు వచ్చేవారు. ఈ క్రమంలో ఈ నెల 4న ఉదయం భర్త పనికి వెళ్లాడు. మధ్యాహ్నం కొడుకుకి ఫోన్ చేయగా, తాను కాలేజీ నుంచి వచ్చానని, ఇంట్లో అమ్మ కనిపించడం లేదని తెలిపాడు. దీంతో వెంటనే నాగరాజు ఇంటికి వచ్చి చుట్టు పక్కల, బంధువుల వద్ద వాకబు చేయగా ఎటువంటి సమాచారం తెలియలేదు. గతంలో మాదిరిగా పుట్టింటికి వెళ్లి ఉంటుందని ఫోన్ చేయగా వారు కూడా రాలేదని తెలిపారు. దీంతో తన భార్య కనిపించడం లేదని పోలసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### పేకాట శిబిరంపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కొత్తపేట పోలీసులు సోమవారం దాడి చేశారు. బూరాడ వారి వీధిలో ఓ ఇంట్లో పేకాటాడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో సీఐ సుబ్రహ్మణ్యం పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేయడంతో పాటు నిందితుల వద్ద నుంచి రూ. 15,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా అదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సోమవారం 3వ ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే 17 మందిని అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టారు. జడ్జి కె.సురేష్ బాబు వారికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. వారిలో ఒక వ్యక్తికి 24 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఇద్దరు వ్యక్తులకు 22 రోజులు జైలు, జరిమానా విధించారు.

### స్కేటింగ్‌లో బంగారు పతకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు తణుకులోని మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో జరిగిన 35వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రోలింగ్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో అండర్–14 ఇన్‌లైన్ హాకీ స్కేటింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో తమ అకాడమీలో శిక్షణ పొందిన నగరానికి చెందిన తోట నీహాల్ ప్రతిభ చూపి బంగారు పతకం పొందాడని శరత్ రోలర్ స్కేటింగ్ అకాడమీ కోచ్ శరత్ కుమార్ ప్రకటనలో తెలిపారు. బంగారు పతకం పొందిన నీహాల్ అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

# జగనన్న పాదయాత్రతోనే ప్రజా సంక్షేమ పాలన

- యాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి పక్షంలో ఉండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చరిత్రను మార్చివేసిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3648 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రతి గుండెను తాకారన్నారు. మహానేత వైఎస్సార్ ఏదైతే పాదయాత్ర చేసి రాష్ట్ర ప్రజలకు మంచి పాలన అందించారో.. అదే తరహాలో సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం భవానీపురం శివాలయం సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చక్కటి మార్పు తెచ్చేందుకు వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి నేటికి ఆరేళ్లు పూర్తయిందన్నారు. పాదయాత్రలో పేదలకు ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టి నూరు శాతం అమలు చేశారని తెలిపారు. నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. ఇదంతా సుదీర్ఘ పాదయాత్రతోనే సాధ్యమైందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు చేస్తున్న మాదిరి కాకుండా ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని వాటికి చక్కటి పరిష్కారం ఇవ్వాలనే గొప్ప సంకల్పంతో వైఎస్ జగన్ పాదయాత్ర చేశారని పేర్కొన్నారు. ఆ పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చరిత్రను తిరగరాసిందన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ అండగా నిలిచారన్నారు.

**చంద్రబాబు కోసమే పవన్ పార్టీ**

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టారే తప్ప తాను ముఖ్యమంత్రి కావడానికి కాదని తెలిపారు. కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము చేయడమే ఆయన సిద్ధాంతమన్నారు. నిరంతరం చంద్రబాబుకు భజన చేయడమే తప్ప పవన్ పార్టీ వల్ల రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని దోచుకున్నారని ధ్వజమెత్తారు. వేల కోట్లు దోచుకుని అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లారన్నారు. జైలులో ఉండి లేని రోగాలు ఉన్నట్లు సృష్టించి, తానొక రోగినని తనకు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు వేడుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ రాష్ట్రంలో జెండా పీకేయడం ఖాయమన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గ గుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గుడివాడ నరేంద్ర, పడిగపాటి చైతన్య రెడ్డి, యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, మైలవరపు రత్నకుమారి దుర్గారావు, మైలవరపు కృష్ణ, అబ్దుల్ అర్షద్ అకీబ్, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### పోలీసు స్పందనలో 84 ఫిర్యాదులు స్వీకరణ



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న డీసీపీ వెంకటరత్నం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ పి.వెంకటరత్నం సోమవారం కార్యాలయంలో పోలీసు స్పందన నిర్వహించారు. బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 25 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలపై 12, సివిల్ వివాదాలపై 15, వివిధ మోసాలపై 10, ఈవ్ టీజింగ్‌పై 1, త్వరితగతిన పరిష్కరించాల్సిన కేసులపై 3, ఇతర చిన్న చిన్న వివాదాలు, సమస్యలు, సంఘటనలకు సంబంధించినవి 18 ఫిర్యాదులు స్వీకరించారు.

# ప్రజారోగ్యానికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష





52వ డివిజన్‌లో మందుల కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

**ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు**

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. 44వ డివిజన్‌లోని 139 సచివాలయం పరిధిలోని ప్రజల కోసం విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల వీఎమ్‌సీ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. హెల్త్ క్యాంప్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందిస్తున్నారని ఆరా తీశారు. అలాగే వైద్యులు, సిబ్బందిని కలిసి ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన ప్రజలను సాదరంగా పలకరించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి తదనుగుణంగా మందులుకూడా అందచేయాలని ఆదేశించారు. హెల్త్ క్యాంప్‌లకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఉపశమనం పొంది సంతృప్తికరంగా వెళ్లేలా చూడాలని సూచించారు. అలాగే వారు చెప్పే ఆరోగ్య సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారం చూపాలి తప్ప విసుక్కోవటం, నిర్లక్ష్యంగా ఉండటం తగదన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమంతోపాటు ఉచిత వైద్య సేవలనుకూడా ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. మహిళల్లో ఉన్న రక్తహీనతకు సంబంధించిన మందులు తీసుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, పార్టీ స్థానిక నాయకులు వల్లం రవికుమార్, అంకాని నాగరాజు, వెలంపల్లి సుబ్బారావు, చిట్టూరి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అండగా ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని 52, 54 డివిజన్లలోని వివిధ సచివాలయాల పరిధుల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మీతో కలిసి శిబిరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికంగా అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో అందుతున్న సేవలపై వైద్య సిబ్బంది నుంచి వివరాలను తెలుసుకున్నారు. అవసరమైన వారికి అందిస్తున్న మందులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ శిబిరాలను చక్కగా వినియోగించుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్షద్, 52వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# కేబీఎన్ సేవలు అపూర్వం

**ఎమ్మెల్యే వెలంపల్లి**



రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సామాజిక వికాసానికి కేబీఎన్ కళాశాల అందిస్తున్న సేవలు అపూర్వమని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల 59వ వ్యవస్థాపక దినోత్సవం ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 59 సంవత్సరాలుగా కేబీఎన్ కళాశాల విద్యారంగ పరిపుష్టికి విశేషమైన సేవలందిస్తుందని చెప్పారు. కళాశాల కేవలం విద్యారంగానికి పరిమితం కాకుండా సామాజిక సేవల్లో ప్రముఖ పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతుందన్నారు. విజయవాడలోనే కాకుండా రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలల్లో ఒకటిగా పేరుగాంచిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు కళాశాల అందుకున్న విజయాలను వివరించారు. తొలుత పూర్వ విద్యార్థులైన వెలంపల్లి శ్రీనివాసరావు ఇతర ప్రముఖులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కళాశాల కోశాధికారి అన్నం రామకృష్ణారావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డిపి రామకృష్ణ, జలూరి నాగశ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానమని కళాశాల అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెలంపల్లి విద్యార్థులను అభినందించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వీఎస్‌రావు, ఎస్ సాంబశివరావు, డి.పవన్‌కుమార్ అధ్యాపకులు డి.హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి


భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో సోమవారం ఇంటరాక్టివ్ సెన్సిటైజేషన్ ప్రోగ్రాం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐపీఏ) ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ సురేష్ మిశ్రా వినియోగదారుల పరిరక్షణ చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల వస్తువులు, సేవలను వినియోగించుకోవడంలో జరిగే మోసాలు, వాటిని ఎదుర్కొనే విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అధికారి పీవీవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వినియోగదారుల పరిరక్షణ చట్టంపై ముద్రించిన పోస్టర్‌లను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పౌర సరఫరాల అధికారి జి.మోహన్‌బాబు, సహాయ సరఫరాల అధికారి సర్కిల్–1 శ్రీలక్ష్మి, సర్కిల్–2 సి.ధనుంజయరెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య, పీఇటీ టీచర్ విజయలక్ష్మి, కన్స్యూమర్ క్లబ్ గైడ్ టీచర్ పులిపాటి దుర్గారావు,సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు వెంకట్, శివ, శ్రీను పాల్గొన్నారు.

### 14న చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):విద్యార్థులకు చిత్రలేఖనంపై ఆసక్తి కలిగించడానికి బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14 తేదీ డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రమేష్ ఆసుపత్రి రోడ్డులోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు ఏలాంటి ప్రవేశ రుసుం లేదని, పాఠశాల, కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులు అయినా పాల్గొనవచ్చునని తెలిపారు. పోటీల్లో డ్రాయింగ్ షీట్ అందచేస్తామని, కలర్స్ విద్యార్థుల వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ సర్టిఫికెట్ అందచేస్తామని చెప్పారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు ఏదైనా అంశంపై బొమ్మలు గీయవచ్చునని, 6, 7వ తరగతుల వారికి ల్యాండ్‌స్కేప్ అనే అంశంపై, 8, 9, 10వ తరగతుల వారికి పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై, ఇంటర్ విద్యార్థులకు పిక్నిక్ అనే అంశం, డిగ్రీ విద్యార్థులు జాతీయ సమగ్రత అనే అంశంపై బొమ్మలు గీయాలని వివరించారు. పోటీలు జరిగే రోజు ఉదయం స్పా కళాశాల ఆవరణలో పేర్లు నమోదు చేసుకుంటామని తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందచేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 95029 44913 నంబరులో సంప్రదించాలని కోరారు.

# డ్వాక్రా సంఘాలకు న్యాయం చేయాలి

**నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు**



బ్యాంక్ వద్ద ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ అగిరిపల్లి మండలంలో మోసపోయిన డ్వాక్రా సంఘాలకు న్యాయం చేయాలని నూజివీడు శాసనసభ్యులు మేకా ప్రతాప్ అప్పారావు కోరారు. ఇటీవల యూనియన్ బ్యాంక్ అగిరిపల్లి శాఖ పరిధిలోని నర్సింగపాలెం, సబ్బురు గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల నుంచి రుణాల వసూళ్లకు బ్యాంక్ నియమించిన ప్రతినిధి సుమారు రూ.1.08 కోట్లు తీసుకొని పరారైనట్లు ఆయా సంఘాల మహిళలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు సోమవారం వారిని తీసుకొని విజయవాడ పాతబస్తీలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం వద్దకు చేరుకొని బ్యాంక్ ఉన్నతాధికారులతో మాట్లాడారు.

మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ అక్కడే ఉండి అధికారులతో చర్చించారు. అనంతరం ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రెండు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళల నుంచి అక్కడి బ్యాంక్ నియమించిన కలెక్షన్ చేసే ప్రతినిధి మహిళలను మోసం చేశారన్నారు. బ్యాంక్ నుంచి ఆ విషయం తెలుసుకున్న మహిళలు తనను సంప్రదిస్తే బ్యాంక్ అధికారులతో మాట్లాడానన్నారు. దానిపై జూలైలో అధికారులు ఆగస్టులో దీనిని పరిష్కరిస్తామని చెప్పామన్నారు. అయితే అప్పటి నుంచి పూర్తిస్థాయిలో పరిష్కారం జరగకపోవటంతో సోమవారం బ్యాంక్ రీజనల్ కార్యాలయానికి రావాల్సి వచ్చిందన్నారు. నేడు బ్యాంక్ అధికారులు మరో రెండు రోజుల్లో సంబంధిత డ్వాక్రా సంఘాల ఖాతాల్లో నగదు జమ చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. అది నెరవేరకపోతే మళ్లీ బ్యాంక్ రీజనల్ కార్యాలయానికి మహిళలందరితో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

## ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనులు పరిశీలన



ఎయిర్‌పోర్టు కారిడార్ పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): గన్నవరం ఎయిర్ పోర్టు కారిడార్ పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మెషిన్లతో పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫుట్‌పాత్, డివైడర్‌కు ఇరువైపుల రోడ్డు పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఏలూరు రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించి ఫుట్‌పాత్‌లపై ఉన్న అనధికారిక ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. డ్రెయిన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సబ్ కలెక్టరేట్ సర్వీస్ స్టేషన్‌ను సందర్శించి వాహనాల డీజిల్ ఫిల్లింగ్ విధానాన్ని తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందిని అడిగి ఫ్యూయల్ డిస్ట్రిబ్యూషన్ రికార్డును పరిశీలించారు. వాహనాలు ఏ సమయంలో డీజిల్ ఫిల్లింగ్ కోసం వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గెలుచుకున్న బహుమతులతో విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైల్వే ఇనిస్టిట్యూట్ వర్క్‌షాప్ కాలనీలో ఆదివారం జేకే గోజురో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 22వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2023లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలయ్యారు. కరాటే ఈవెంట్‌లో జెకె గోజురో అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచికి చెందిన 11 మంది ప్రథమ స్థానంలో, ఆరుగురు ద్వితీయ, ఏడుగురు తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంటుపల్లి రైల్వే వేగన్ వర్క్‌షాప్ అధికారి ఎస్.శ్రీనివాస్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసం చేసే ప్రతి విద్యార్థి కరాటే విద్యను కూడా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినులు తమ ఆత్మరక్షణ కోసం కరాటే, కుంగ్‌ఫూ వంటి యుద్ధ విద్యల్లో శిక్షణ పొందాలన్నారు. విజేతలను కెఎఐ చైర్మన్ డాక్టర్ యు బ్రహ్మానందం, ప్రెసిడెంట్ జె.విజయ్ కుమార్, సెక్రటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ సీహెచ్ మహేష్ బాబు, నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ పద్మజ, హెడ్ కోచ్ జె హరనాథ్, జెకె గోజురో అకాడమి సత్యనారాయణపురం బ్రాంచ్ కోచ్ పీవీకెఎస్ హర్ష, ఇతర బ్రాంచ్‌ల కోచ్‌లు మధు, శ్రీకర్, నరసింహ, దినేష్, సాయికుమార్, యశ్వంత్, నవీన్‌లు అభినందించారు.

# 15 నుంచి హోం గార్డెన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోజ్ సొసైటీ సభ్యులు

పటమట(విజయవాతూర్పు): రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు హోంగార్డెన్ కాంపిటీషన్స్, జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో హార్టికల్చర్ షో నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు జీ ఎస్ఆర్ మోహన్‌రావు తెలిపారు. ఫన్ టైం క్లబ్ వెనక సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరాల్లో పెరిగిపోయిన కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ ఇంట్లో తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హోం గార్డెన్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ పోటీలు నాలుగు కేటగిరీలలో జరుగుతుందని పేర్కొన్నారు. చిన్నా – పెద్ద తోటలు, పండ్లు, కూరగాయ మొక్కలు, టెర్రస్ గార్డెన్లు పెంచే ఔత్సాహిక మొక్కల ప్రేమికులు పాల్గొనవచ్చన్నారు. సొసైటీ కార్యదర్శి పద్మప్రియ మాట్లాడుతూ జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే హార్టికల్చరల్ షోలో అనేక జిల్లాల నుంచి మొక్కల ప్రేమికులు, నర్సరీల నిర్వాహకులు పాల్గొంటున్నారని వెల్లడించారు. మొక్కల ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా ఉంటాయని వివరించారు. మొక్కలకు సంబంధించిన కుండీలు, ఎరువులు, ఆర్గానిక్ క్రిమిసంహారక మందులు తదితర స్టాల్స్ ను నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. కాంపిటీషన్లో పాల్గొనదలుచుకున్న వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోలని సూచించారు. అనంతరం సొసైటీ సభ్యులు హోం గార్డెన్ కాంపిటీషన్స్ బ్రోచర్ రిలీజ్ చేశారు. సొసైటీ సభ్యులు డాక్టర్ సీత మహాలక్ష్మి ఛాయాదేవి, ఉషా రాణి, రత్నలక్ష్మి, ఎ. లక్ష్మి, విశాల, సుమబిందు, జ్యోత్స్న, రాఘవేంద్రరావు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

### 19న ఛత్రపతి శివాజీ చారిత్రక నాటక ప్రదర్శన



విజయవాడ కల్చరల్: సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో 19వ తేది ఆదివారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సంచాలక్ కోనేరు దుర్గాప్రసాద్ తెలిపారు. సంస్కార భారతి ఆధ్వర్యాన అయోధ్యనగర్‌లోని హైందవి కార్యాలయంలో విలేకరుల సమావేశం బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ 350 జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా శివాజీ జీవితంలోని ముఖ్య ఘట్టాల ఆధారంగా చేసిన నాటకం తొలి ప్రదర్శన నగరంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రచయిత, దర్శకుడు పీవీఎన్ కృష్ణ, అతిథులు బ్రోచర్ ఆడియోను ఆవిష్కరించారు. సమావేశంలో సంస్కార భారతి ఏపీ ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ మహానగర్ సంఘ్ చాలక్ కృష్ణప్రసాద్, బీ పవన్‌కుమార్, సంస్కార భారతి సభ్యులు పాల్గొన్నారు.

### వేధింపుల భర్తపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతిన వారి వీధికి చెందిన తొత్తడి నాగ హారికకు 2015లో తులసీరామ్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. ముఠా పని చేసే తులసీరామ్ కొంత కాలంగా భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. మద్యం తాగి భార్యను వేధించడంతో గత ఏడాది మే నెలలో పుట్టింటికి వచ్చేసింది. కొద్ది రోజుల కిందట అత్త గారి ఇంటికి వచ్చిన తులసీరామ్ భార్యను దూషించాడు. భర్త వేధింపులపై నాగహారిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.